# జీలుగుమిల్లి మండలంలో భారీ వర్షం

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఇటీవల నాటిన పొగాకు, మిరప నాట్లలోకి నీళ్లు చేరాయి. ఎగువన కురిసిన భారీ వర్షానికి కామయ్యపాలెం వాగు, వంకవారిగూడెం వాగు, అశ్వారావుపేట వాగుల గుండా నీరు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటలపాటు ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

మిరప నాట్లలోని చేరిన నీరు

# వైసిపి 'ఢీ' కొడుతుందా..!

**21న సాగునీటి సంఘాల ఎన్నికలు**

**గుంభనంగా వైసిపి అధినాయకత్వం**

**క్షేత్రస్థాయిలో పలుచోట్ల నేతలు పోటీకి సిద్ధం**

**పూర్తయిన ప్రాదేశిక నియోజకవర్గాల జాబితా**

**11వ తేదీకి ఓటర్ల జాబితా సిద్ధంపై అధికారుల కసరత్తు**

**24, 27 తేదీల్లో డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీల ఎన్నిక**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైసిపి పోటీ చేస్తుందా.. ఏకపక్షంగా కూటమి ప్రభుత్వానికి వదిలేస్తుందా అనే చర్చ గ్రామాల్లో విస్తృతంగా నడుస్తోంది. క్షేత్రస్థాయిలో పలుచోట్ల వైసిపి నాయకులు పోటీకి సిద్ధమవుతున్నప్పటికీ అధిష్టానం నుంచి మాత్రం స్పష్టమైన సంకేతాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అధిష్టానం ఆదేశిస్తే గెలుపోటములతో సంబంధం లేకుండా సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఢీకొట్టేందుకు వైసిపి నాయకులు సిద్ధపడుతున్నారు. చేతులెత్తే పద్ధతిలో సాగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వైసిపి నాయకుల్లో వ్యక్తమవుతోంది. అక్టోబర్ 21న సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. 40 రోజుల్లో ప్రక్రియ పూర్తిచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన కసరత్తు వేగంగా సాగుతోంది. అక్టోబర్ 31న ప్రాదేశిక నియోజకవర్గాల జాబితాను సిద్ధం చేసి అభ్యంతరాల స్వీకరణకు ప్రచురించారు. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజకవర్గాలు 98, మైనర్ 14, ప్రాజెక్టు కమిటీ ఒకటిగా తేల్చారు. ఏలూరు జిల్లాలో మేజర్ యూజర్స్ అసోసియేషన్ల ప్రాదేశిక నియోజకవర్గాలు 92, మైనర్ 253, మీడియం 11 నియోజకవర్గాలుగా తేల్చారు. ఈ నెల మూడో తేదీన అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుదిజాబితా ప్రకటిస్తారు. ఆరో తేదీ నుంచి 11వ తేదీ మధ్య ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ నెల 20న వివిధ స్థాయిల్లో నోటిఫికేషన్లు జారీ చేసి 21న సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. వాటర్ యూజర్స్ కమిటీల ఎన్నికలు పూర్తయిన తర్వాత నవంబర్ 21న డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులను, 27న ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుల ఎన్నికలు జరగనున్నాయి.

**స్తబ్దతగా వైసిపి నాయకత్వం**

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నా వైసిపి నాయకత్వం పెద్దగా పట్టించుకున్న పరిస్థితి కనిపించడం లేదు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో తమ నాయకులను పోటీకి దింపుతుందో, లేదో కూడా ఇప్పటికీ వరకూ నిర్ణయం తీసుకోలేదు. ఒక్కో వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజకవర్గంలో వంద నుంచి 150 వరకూ ఓట్లు ఉండే అవకాశం ఉంటుంది. అందులో వైసిపి అభిమాన రైతాంగం కూడా ఉండనుంది. బరిలోకి దిగితే గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది. ఒకవేళ అధికార పార్టీ ఘర్షణలకు దిగి తమకు అనుకూలంగా చేసుకుంటే ప్రజల్లో చర్చ సైతం సాగే పరిస్థితి ఏర్పడుతుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో పలుచోట్ల సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీకి దిగేందుకు వైసిపి నాయకులు సిద్ధమవుతున్నారు. వైసిపి నాయకత్వం మద్దతు కూడా ఉంటే బాగుంటుందనే అభిప్రాయం నాయకుల్లో వ్యక్తమవుతోంది. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ చేతులెత్తే పద్ధతిలో జరగనుంది. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు రైతులు సంకోచిస్తారనే మరో అభిప్రాయం వైసిపి నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఏదేమైనా ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని, పోటీ ఉండాలని గ్రామాల్లో రైతులు కోరుకుంటున్నారు. దీనిపై వైసిపి అధినాయకత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

**అధిష్టానం నుంచి ఆదేశాలు రాలేదు**

**దూలం నాగేశ్వరరావు, వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు**

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీపై అధిష్టానం నుంచి కబురు రాలేదు. ఆదేశాలు వస్తే అధికారికంగా చెబుతాం.

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి

**సోమవరప్పాడు సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి**

**ప్రజాశక్తి - దెందులూరు**

విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని సోమవరప్పాడు గ్రామ సచివాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సిబ్బంది వారికి నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. వివిధ రకాల సేవలద్వారా వచ్చిన నగదును 24 గంటల్లోగా బ్యాంకులలో జమ చేయాలన్నారు. ప్రభుత్వ నగదు సచివాలయ సిబ్బంది వద్ద ఉండకూడదన్నారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్‌తో పాటు తహశీల్దార్ సుమతి ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

# చిన్నబ్బాయి ఆదర్శప్రాయులు

**మంత్రి కొలుసు పార్థసారధి**

**ప్రజాశక్తి - భీమడోలు**

మండలంలో చెట్టున్నపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లవరం గ్రామాభివృద్ధికి స్థానిక నాయకులు బోయిన చిన్న సత్యనారాయణ (చిన్నబ్బాయి) చేసిన కృషి అభినందనీయమని, ఇతరులకు ఆదర్శప్రాయమని జిల్లా గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మంత్రి శనివారం సాయంత్రం మల్లవరం గ్రామంలో పర్యటించారు. చిన్నబ్బాయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి విశేష కృషి చేసిన చిన్నబ్బాయి జ్ఞాపకార్థం, ఆయన విగ్రహం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి రూ.30 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ తాను ఎంఎల్‌ఎ నిధుల నుంచి రూ.పది లక్షలు కేటాయిస్తానన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మాజీ ఎంఎల్‌ఎలు ఘంటా మురళి, గన్ని వీరాంజనేయులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

చిన్నబ్బాయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారధి

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**బాలుర వసతిగృహాన్ని సందర్శించిన రత్నప్రసాద్**

వసతి గృహంలో రత్నప్రసాద్

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శనివారం శనివారపుపేటలోని బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించి వారి మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను కేసుల రాజీకి వినియోగించుకోవాలన్నారు.

# కూటమిలో కుంపట్లు..!

**టిడిపి, జనసేన, బిజెపి మధ్య బయటపడ్డ విభేదాలు**

**కూటమి ఆత్మీయ సదస్సులో సీనియర్ నేతలు, ఎంఎల్‌ఎలు, ఇన్‌ఛార్జీలు సమస్యల ఏకరువు**

**ఎవరికివారే తమ పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వట్లేదని అసంతృప్తి**

**సమన్వయంతో కలిసి పని చేయాలి: ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్**

**వ్యక్తిగత పౌరుషాలకు పోవద్దు: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ**

**వారం రోజుల్లో సులభంగా ఇసుక: మంత్రి రామానాయుడు**

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లాలో టిడిపి, జనసేన, బిజెపి మధ్య కొన్ని రోజుల నుంచి చాప కింద నీరులా ఉన్న విభేదాలు బట్టబయలయ్యాయి. టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్నచోట జనసేన, బిజెపి నేతలు, జనసేన ఎంఎల్‌ఎలు ఉన్నచోట టిడిపి, బిజెపి నేతలు తమ పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జిల్లాలోని కూటమి నేతల మధ్య కుంపటి తారాస్థాయికి చేరింది. స్థానిక మల్టీప్లెక్స్ వెనుక ఉన్న అల్లూరి శ్రీరామరాజు ఫంక్షన్ హాల్లో ఎన్‌డిఎ కూటమి ఆత్మీయ సదస్సు టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సదస్సుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లాలోని ఎంఎల్‌ఎలు, టిడిపి, జనసేన, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో తమ పార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదు అంటూ నేతలు పరస్పర ఆరోపణలకు దిగారు. టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడి పని చేస్తే కనీసం కార్యక్రమాలకు పిలిచే పరిస్థితి లేదన్నారు. బిజెపి భీమవరం నియోజకవర్గ కన్వీనర్ సురేంద్ర మాట్లాడుతూ కనీసం ప్రొటోకాల్ పాటించట్లేదని, చివరకు బ్యానర్లో సైతం ఫొటోలు వేయడం లేదని ఆరోపించారు. జనసేన సీనియర్ నేత కనకరాజు సూరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టిడిపికి 60 శాతం, జనసేనకు 30, బిజెపికి పది శాతం చొప్పున పదవులు కేటాయిస్తామని చెప్పినా అమలు కావట్లేదని, 'నేనే రాజు.. నేనే మంత్రి' అన్నట్టుగా ఉంటున్నారని అన్నారు. జనసేన పాలకొల్లు ఇన్‌ఛార్జి బన్ని వాసు మాట్లాడుతూ పాలకొల్లులో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ సోదరభావంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ మాట్లాడుతూ తమ కేడర్‌కు గుర్తింపు ఇవ్వడమే కాకుండా నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. జనసే జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ రీసర్వేలో అనేక లోటుపాట్లు ఉన్నాయని, వాటిని చేయాలన్నారు. జిల్లాలో వ్యవసాయం, ఆక్వా, విద్యుత్, ఉచిత ఇసుక, రీసర్వే, ఎంఎల్‌సి ఎన్నికలు, సాగునీటి సంఘాలు, సొసైటీ ఎన్నికలు, డెల్టా ఆధునికీకరణ, తాగునీటిపై సమావేశంలో ప్రధాన చర్చ సాగింది. ఈ సదస్సులో ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, బిజెపి నేత పాకా వెంకట సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పశ్చిమ ఎడారిగా మారే ప్రమాదం ఉంది**

**పులపర్తి రామాంజనేయులు, భీమవరం ఎంఎల్‌ఎ**

గతంలో ధాన్యాగారంగా ఉన్న జిల్లాలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అవసరమైతే క్రాప్ హాలిడే ప్రకటించైనా ఆధునికీకరణ పనులు పూర్తి చేయాల్సిందే. లేకపోతే పశ్చిమ ఎడారిగా మారిపోయే ప్రమాదం ఉంది. గతంలో యనమదుర్రు డ్రెయిన్‌పై రూ.40 కోట్లతో నిర్మించిన మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. వీరవాసరంలో 33 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. భీమవరంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు తెస్తే 600 ఎకరాల భూమి సేకరిస్తాం.

**వశిష్ట వారధి నిర్మించాలి**

**బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎంఎల్‌ఎ**

జిల్లాలో పర్యాటక కేంద్ర అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పేరుపాలెం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా గోదావరిపై వశిష్ట వారధి నిర్మించాలి.

**వంద మెట్లు కిందకు దిగినా ఫలితం ఉండట్లేదు**

**బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ**

పదేళ్లపాటు ఎంతో కష్టపడ్డా. నా ఆస్తులను సైతం అమ్ముకున్నా. కూటమిగా ఉన్నప్పుడు సమస్యలు రావడం సహజమే. అంతేగాని నాకు పదవి కావాలి. నేను లీడర్ కావాలంటే నేనేమీ చేయలేను. వంద మెట్లు కిందకు దిగొచ్చినా వినకపోతే ఎలా. రాష్ట్రంలో ఒక రూల్ పెట్టాలి. దానికి అనుగుణంగా కూటమి నేతలు నడుచుకునేలా చర్యలు తీసుకోవాలి. ఇసుక విధానంలో మార్పు తీసుకురావాలి. స్టేట్‌హైవేలు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

**కూటమి ఐక్యత కాపాడాలి**

**ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎంఎల్‌ఎ**

ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పని చేసినట్లే ఇప్పుడు కూడా కలిసి ముందుకు సాగాలి. ఎటువంటి మనస్పర్థలూ లేకుండా ఉండాలి. స్టేట్‌హైవేల కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. ఉపాధి హామీ నిధులు గతంలో నియోజకవర్గానికి రూ.25 కోట్లు వచ్చేవి. ఇప్పుడు కేవలం ఆరు నుంచి ఏడు కోట్లు మాత్రమే వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలి.

**జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకోవాలి**

**కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఉండి ఎంఎల్‌ఎ**

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఒక్కరే ఉన్నారు. నిధులు అన్నీ ఆ జిల్లాకే ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. అభివృద్ధి చేసేందుకు జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకోవాలి. ఆక్వా రంగానికి విద్యుత్ యూనిట్ కనీసం రూ.2 లేదా రూ.2.25 పైసలకుగాని అందించాలి. నియోజకవర్గాల్లో ఏ పార్టీ ఎంఎల్‌ఎ ఉంటే ఆ పార్టీకి ఎక్కువ అవకాశం ఉంటుంది. మూడు పార్టీలు సమన్వయంతో కలిసి వెళ్లేందుకు ఇబ్బందులున్నా తప్పదు ముందుకు సాగాలి.

**వారం రోజుల్లో ఇసుకను సులభతరం చేస్తాం**

**నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ మంత్రి**

ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించాం. ఇలాగే గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు, సాగునీటి సంఘాలు, కోఆపరేటివ్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేలా పని చేయాలి. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వాటిపైనా దృష్టి పెట్టాలి. నరసాపురం నుంచి సిద్ధాంతం వరకు ఇసుక సమస్య ఉంది. వారం రోజుల్లో ఇసుక సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

**వ్యక్తిగత పౌరుషాలకు పోవద్దు**

**భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కేంద్ర సహాయ మంత్రి**

మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలి. లేకపోతే అనేక ఇబ్బందులు వస్తాయి. పొరపాట్లు జరిగినా, అవమానాలు ఎదురైనా అంతా కలిసి పని చేయాలి. ఆధిపత్య పోరు వదలాలి. వ్యక్తిగత పౌరుషాలకు పోకూడదు. కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాను.

**గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి**

**మంతెన రామరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు**

రాష్ట్ర అభివృద్ధి కూటమి లక్ష్యం. కలిసి ఉన్నచోట సమస్యలు వస్తాయి. వాటిని అధిగమించి ముందుకు సాగాలి. నాయకుడి నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. ఎవరికి వారు తక్కువేమీ కాదు. గౌరవం ఇచ్చిపుచ్చుకుంటేనే ఎటువంటి ఇబ్బందులూ ఉండవు.

**జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి**

**గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి**

సమస్యలు పక్కన పెట్టి సమన్వయంతో అంతా పని చేయాలి. ప్రజల విశ్వాసాన్ని కోల్పోకుండా నమ్మకంతో ముందుకు సాగాలి. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలపై దృష్టి పెట్టాలి. ఓటర్ల నమోదుకు నాలుగు రోజులే అవకాశం ఉంది. నీటిసంఘాలు, సొసైటీ ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా చూడాలి. రీసర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారానికి త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహిసారు. ఆక్వారంగ అభివృద్ధికి విద్యుత్ రాయితీ అందిస్తాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. స్మార్ట్ మీటర్లు అడిగిన వారికే బిగించడం జరుగుతుంది. దీనిపై అపోహలు వద్దు.

# మాటల్లో చిత్తశుద్ధి.. చేతల్లో ఉండేనా..!

ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న వరుస ఘటనలు ప్రజల్లో కలవరం సృష్టించగా.. పాలకుల మాటల్లో చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా కన్పిస్తోంది. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై గ్రామసభ కలవరం సృష్టించగా, మద్యం బెల్టుషాపుల అంశం, రోడ్లపై గోతుల పూడ్చివేత అంశం పాలకుల మాటల్లో చిత్తశుద్ధి ఏపాటిదనే అంశం చర్చనీయాంశమైంది.

వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదన సుమారు సంవత్సరాల క్రితమే వచ్చింది. దీనిపై వైసిపి ప్రభుత్వం దుందుడుకుగా వెళ్లబోగా గ్రామసభలో ప్రజలు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపి, డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామ సభలో తీర్మానం చేయడంతో ఆ ప్రక్రియ నిలిచింది. దీనిపై తర్వాత అధికార యంత్రాంగం ద్వారా పలు ప్రయత్నాలు చేసినా ప్రజల నుంచి గట్టి ప్రతిఘటనే ఎదురైంది. దీంతో వైసిపి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక మళ్లీ జిల్లా అధికారులు నేవీ ఆయుధ డిపోకు భూసేకరణ యత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా వంకావారిగూడెంలో ఇటీవల గ్రామసభ నిర్వహించగా పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు సైతం హాజరయ్యారు. జనం ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకించాక ఎంఎల్‌ఎ బాలరాజు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు కాబట్టి గ్రామస్తుల అభిప్రాయాన్ని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని, తన చేతుల్లో ఏమీ లేదని చెప్పడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంతంలో ఏ పని చేపట్టాలన్నా పీసా చట్ట ప్రకారం గ్రామసభ ఆమోదమే కీలకమని సదరు ప్రజాప్రతినిధికి తెలియదా అనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. అదే సమయంలో గిరిజనులు నేవీ ఆయుధ డిపోను ఎందుకు వ్యతిరేకిస్తున్నారనేది తెలుసుకునే ప్రయత్నం అటు అధికారులు, ఇటు అధికారపక్ష నేతల నుంచి జరగలేదని తెలుస్తోంది. ఒకసారి గిరిజనుల మనోగతం పరిశీలిస్తే పోలవరం నిర్వాసితుల కాలనీలు ఈ మండల పరిధిలోనే ఎక్కువ నిర్మించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన డంపింగ్ యార్డును కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. వీటికి అవసరమైన భూములను గిరిజనులు త్యాగం చేసి ఇచ్చారు. పరిహారం కోసం పోరాడారు తప్ప భూములు ఇవ్వలేమని నాడు చెప్పలేదు. అయితే నేడు నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే దాని నిర్మాణ పరిధిలో భూములు కోల్పోవడం తప్ప గిరిజనులకు ఎటువంటి సమస్యా ఉండదనుకుంటే పొరబడినట్లే. ఎందుకంటే నేవీ ఆయుధ డిపో రక్షణ రంగానికి సంబంధించినది. కచ్చితంగా దాని రక్షణ పేరిట ఆ డిపో పరిధిలో సుమారు ఐదు నుంచి పది కిలోమీటర్ల మేర జన సంచారంపై కచ్చితంగా ఆంక్షలు ఉంటాయి. అదే జరిగితే గిరిజనులు అడవిలోకి వెళ్లడం, రోజువారీ కార్యకలాపాలకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఫలితంగా అడవికి గిరిపుత్రులు దూరంగా నెట్టేయబడుతారనేది బహిరంగ రహస్యం. ఈ పరిస్థితుల్లో వారి మనోగతం, ఆందోళన అర్థం చేసుకోకుండా జిల్లాలోని ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు అధికారపక్షంపై తీవ్ర వ్యతిరేకతను పెంచుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

మద్యం దుకాణాలు ప్రారంభమై 15 రోజులు దాటింది. ఈ దుకాణాల ఏర్పాటు, ప్రారంభం విషయంలో కూటమి నేతలు అంతర్లీనంగా శాసించారు. అంతటితో ఆగకుండా కొన్నిచోట్ల బెల్టుషాపుల ఏర్పాటుకు లాటరీ వేసి మరీ అవకాశం కల్పించారు. ఆ పేరిట బెల్టుషాపు ఏర్పాటుకు అనుమతి దక్కించుకున్న వ్యక్తి దగ్గర నుంచి కొంత సొమ్ము తీసుకుని గ్రామాభివృద్ధికి నిధి అంటూ కలరింగ్ ఇచ్చారు. అయితే దీనికి భిన్నంగా బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే తాను బెల్టు తీస్తానంటూ సిఎం చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తుండటం గమనార్హం. ఈ హెచ్చరికలు ఖాతరు చేయకుండా తెలుగుతమ్ముళ్లే బెల్టుషాపుల ఏర్పాటులో కీలకంగా వ్యవహరిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీనిలో కొన్నిచోట్ల ఎంఎల్‌ఎల పాత్ర సైతం ఉండటం గమనార్హం. ఈ పరిస్థితుల్లో మద్యం ఏరులై పారుతుందనేది అందరికీ తెలిసిందే. దీపావళి రోజు, మరుసటి రోజు తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో చోటుచేసుకున్న హత్యల్లో మద్యం పాత్ర ఉండటం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే రెండు జిల్లాల పరిధిలో క్రైమ్‌రేటు పెరిగిందనేది వాస్తవం. ఇప్పుడు మద్యం ఏరులై పారు తుండటంతో పరిస్థితి మరింత భయాన కంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు బెల్టు షాపుల నియంత్రణపై దృష్టి సారించి నిర్వాహకులపై కొరడా ఝుళిపిస్తే జిల్లా ప్రజలకు ఎంతోకొంత మేలు ఉంటుంది. లేనిపక్షంలో నేతల మాటల్లో చిత్తశుద్ధి లేదని జనం భావించే అవకాశం ఉంది.




ఇక గుంతలు పూడ్చే కార్యక్రమాలను జిల్లాలో ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభిస్తున్నారు. సంతోషం. అయితే అదేదో తూతూమంత్రంగా అయితే మళ్లీ నెల రోజుల్లోనే రోడ్లన్నీ గోతులతో నిండే ప్రమాదం ఉంది. గోతులను పూడ్చటంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలనేది ప్రజల డిమాండ్. కొంత బూడిద తీసుకొచ్చి వేసి కలరింగ్ ఇస్తున్నారనేది జనం విమర్శ. అలా కాకుండా గ్రావెల్‌తో పటిష్టంగా గోతుల పూడ్చివేత చేపట్టాలని జనం కోరుతున్నారు. దీంతోపాటు మార్జిన్లలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే వర్షం వస్తే నీరంతా రోడ్లపైనే నిలిచిపోవడానికి ప్రధాన కారణం జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడమే. రోడ్ల మార్జిన్లలో తుప్పలు తొలగించి నీరు రోడ్డుపై నిలబడకుండా చేయగలిగితే కొద్దిరోజులైనా రోడ్లు బాగుండే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు. మరి పాలకులు బెల్టుషాపులు, రోడ్లకు మరమ్మతుల విషయంలో ఎలా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

# 13 నుంచి బుట్టాయగూడెంలో సిపిఎం జిల్లా మహాసభ

**13న వేలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ**

**కరపత్రాలు ఆవిష్కరించిన సిపిఎం నాయకులు**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఈ నెల 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరిగే సిపిఎం 26వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సిపిఎం ఏలూరు జిల్లా కార్యాలయంలో సిపిఎం 26వ జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, ఏలూరు నగర నాయకులు వివివిఎస్.ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మూడేళ్లకు ఒకసారి జరిగే జిల్లా మహాసభలు ఈ సారి ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయగూడెంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 13న తేదీన వేలాది మందితో బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉద్యమాలకు ప్రతినిధులుగా ఎన్నికైన 250 మందితో 14, 15 తేదీల్లో ప్రతినిధుల సభ జరగనున్నట్లు స్పష్టం చేశారు. ఏలూరులో సమగ్రాభివృద్ధికి ఉన్న సమస్యలు, వాటికి సంబంధించిన అంశాలు, తగిన ప్రతిపాదనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, జిల్లాలో ఉన్న పోలవరం నిర్వాసితులు, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1/70, ఎల్‌టిఆర్ భూముల సమస్యలు, ఇటీవల కొత్తగా జీలుగుమిల్లి మండలంలో ఆయుధ పరిశ్రమ స్థాపించి అక్కడి వాళ్లను వెళ్లగొట్టే ఆలోచనలు, ఇతర రైతాంగం, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, చేతవృత్తిదారులు, యువకులు, విద్యార్థులు, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, లౌకికతత్వ పరిరక్షణకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు తూట్లుపొడిచే ఆలోచనలు తదితర సమస్యలపై సిపిఎంగా రానున్న కాలంలో రూపొందించాల్సిన కార్యాచరణను చర్చించేందుకు ఈ జిల్లా మహాసభలు జరుపుతున్నామన్నారు. ప్రజల మేలు కోసం పాటుపడే సిపిఎంను ఆదరించాలని, ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.




జిల్లా మహాసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

## నేలకొరిగిన వరిచేలు పరిశీలన

**ప్రజాశక్తి వార్తకు స్పందన**

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలో గత మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లో స్వర్ణ వరి రకం నేలకొరిగిందని మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ తెలిపారు. నేలకొరిగిన వరిచేలు శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ స్పందించారు. పెదగొన్నూరు, బొమ్మినంపాడు గ్రామాల్లో నేలకొరిగిన వరి చేలను ఆయన పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముందుగా చేలలో నిల్వ ఉన్న అధిక నీటిని కాలువల ద్వారా బయటకు తీసివేయాలన్నారు. పడిపోయిన పైరును లేపి కట్టలుగా కట్టుకోవాలన్నారు. తయారైన గింజ రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ సూచనను వరి రైతులు పాటించాలని చెప్పారు.

## రోడ్లకు మరమ్మతులు చేయాలి : సిపిఎం

**ప్రజాశక్తి - ముసునూరు**

నూజివీడు డివిజన్ పరిధిలో గుంతలమయంగా ఉన్న రహదారులను బాగు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముసునూరులో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూజివీడు డివిజన్ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లోని రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయన్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ప్రభుత్వం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసరావు, కంచర్ల దుర్గారావు, కంచర్ల శ్రీనివాసరావు, కంచర్ల రమేష్, కంచర్ల సత్యనారాయణ, గంగుల సత్యం, పిల్లి మురళి, కుటుంబరావు, సిహెచ్. శ్రీనివాసరావు, పినిబోయిన శ్రీనివాసరావు, పోటురు శ్రీనివాసరావు, రంగారావు పాల్గొన్నారు.

## 'కాన్‌టెక్'లో ట్రిపుల్ ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు ట్రిపుల్ ఐటీ కాలేజీలోని మెటలర్జీ ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన కాన్‌టెక్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. మొదటి ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ ద్వారా తర్ఫీదు పొందుతారు. ఆ సమయంలో ప్రతినెలా రూ.15 వేల స్టైఫండ్ పొందనున్నారు. ఆ తదుపరి ఉద్యోగంలో నియమితులవుతారు. ఎంపికైన విద్యార్థులందరినీ డైరెక్టర్, ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ అభినందించారు. దేశానికి మెటలర్జీ విభాగంలో ఉద్యోగార్థుల కొరత ఉందని, ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయని విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెటలర్జీ విభాగం ప్రొఫెసర్లు వీర శ్రీను, శివకుమార్ పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి పెద్దపీట

**పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు**

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

టిడిపి కూటమి ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. స్థానిక హెచ్‌పి గ్యాస్ కంపెనీ వద్ద దీపం-2 పథకంలో అర్హులైన మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ మండల ప్రెసిడెంట్లు ఎస్.సాయి, పి.రాము, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సందీప్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ వెళ్లి పెన్షన్ అందజేత

**ప్రజాశక్తి - పోలవరం**

పోలవరం మండల పరిధిలోని ఎల్ఎన్‌డి.పేట గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్ సంసాని వీర్రాజు అనారోగ్యంతో వారం రోజుల నుంచి హైదరాబాద్ ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీర్రాజుకు పింఛన్‌ను వెంటనే అందించాలనే తలపుతో ఈ విషయం తెలుసుకున్న పోలవరం ఎంపిడిఒ శ్రీనివాసరావు తన సొంత ఖర్చులతో ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్‌ను ఆసుపత్రికి వెళ్లి వీర్రాజుకు రూ.పది వేల పింఛను అందించారు. ఎంపిడిఒ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు వీర్రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత**

**చింతలపూడి :** విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందిపం గోపీకి ఇంజినీరింగ్ అసిస్టెంట్ జగదీశ్వరిచారి విజయవాడ వెళ్లి పింఛన్ అందించారు. గోపీ హర్షం వ్యక్తం చేశాడు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఎంపిడిఒ అభినందించారు.

## యాత్రికులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు

**పట్టిసీమ ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ**

**ప్రజాశక్తి - పోలవరం**

కార్తీక మాసం సందర్భంగా పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివ క్షేత్రానికి తరలివచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ శనివారం తెలిపారు. యాత్రికులు గోదావరి నదీ తీరంలో స్నానాలు ఆచరించేందుకు నదిలో బారీ కేడింగులు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేశామని, కార్తీకమాసం నెలరోజులు వచ్చే యాత్రికులు ఇసుకతిన్నెలపై సేద తీరేందుకు చలువ పందిరిని, నది దాటించేందుకు లాంచీలకు రేవు వద్ద ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లైఫ్ జాకెట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నది దాటించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామని పట్టిసీమ ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ, బొరుసు రాంబాబు తెలిపారు.

**అధికారిక ర్యాంపుల వద్దే స్నానాలు చేయాలి**

కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీ పరిధిలో యాత్రికులు గోదావరి స్నానాలు ఆచరించేందుకు అనువుగా ర్యాంపులను సిద్ధం చేసినట్లు సర్పంచి మైగాపుల విజయదుర్గ తెలిపారు. ఆయా రేవుల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు, ఎల్ఇడి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున, లోతుగా ఉన్నందున అధికారికంగా సిద్ధం చేసిన ర్యాంపుల వద్ద మాత్రమే యాత్రికులు స్నానాలు చేయాలని చెప్పారు.

## ఫిషర్‌మెంట్ సొసైటీ ఎన్నికలు వాయిదా

**ప్రజాశక్తి - మండవల్లి**

తక్కెళ్లపాడు ఫిషర్‌మెంట్ సొసైటీ ఎన్నికలను వాయిదా వేసినట్లు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ నూజివీడు శాఖాధికారి సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కెళ్లపాడులోని ఫిషర్‌మెంట్ సొసైటీ 101 మంది సభ్యులతో ఉందన్నారు. ఆ సొసైటీలో 51 మంది సభ్యులు మృతి చెందగా కేవలం 50 మంది మాత్రమే ఉన్నారన్నారు. సొసైటీకి ఎన్నిక నిర్వహించడానికి శనివారం రంగం సిద్ధం చేశామన్నారు. నిర్ణీత సమయానికి నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికను వాయిదా వేశామని తెలిపారు. సదరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారిచ్చే ఆదేశాలపై తిరిగి ఎన్నికలు నిర్వహిస్తామని సతీష్‌కుమార్ తెలిపారు.

## ఎంఎల్‌సి ఓటు నమోదు చేసుకోండి

**జీలుగుమిల్లి :** 2021 సంవత్సరానికి ముందు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతిఒక్కరూ ఎంఎల్‌సి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోగలరని సిఐటియు మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ ఆరో తేదీ లోపు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు 18 అప్లికేషన్ పూర్తి చేసి గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకాలు చేసి తహశీల్దార్ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

## నేరాలు - ఘోరాలు

### బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి - కైకలూరు**

బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేశారు. కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బాలికకు కైకలూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన సుగుణరావు మాయ మాటలు చెప్పి ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారాయత్నానికి పాల్పడుతుండగా బాలిక భయంతో కేకలు వేసింది. దీంతో సుగుణరావు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక సాయంత్రం ఇంటికి వచ్చి జరిగిన విషయం తన తల్లిదండ్రులకు చెప్పింది. వారు కైకలూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి టౌన్ ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ నిందితుడు సుగుణరావును శనివారం అరెస్టు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

## పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

**ఎఒ వేణుమాధవ్**

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

రైతులు పంటల బీమా పరిహారం పొందాలంటే బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ శనివారం తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, దిగుబడి ఆధారిత స్వచ్ఛంద నమోదు రబీ 2024-25 సీజన్‌లో నోటిఫైడ్ ఏరియాలో నోటిఫైడ్ పంటలను సాగు చేస్తున్న రైతులందరూ పిఎంఎఫ్ బివై మార్గదర్శకాల ప్రకారం కవరేజ్ నమోదుకు అర్హులన్నారు. నమోదు చేసుకునేందుకు రైతులు అవసరమైన ప్రీమియాన్ని నిర్ణీత వ్యవధిలో చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లింపునకు ఆఖరి తేదీ డిసెంబర్ 31 అని, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు డిసెంబర్ 15 నాటికీ రైతులందరూ నిర్ణీత సమయంలో నమోదు చేయించుకోవాలని ఎఒ బొర్రా వేణుమాధవ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు సూచించారు. ఏలూరు నగరంలోని చైతన్య టెక్నో పాఠశాలలో రోడ్డు ప్రమాదాలపై అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ప్రమాదాల జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగంపై వారికి అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ అంశాలపై అవగాహన కల్పిస్తే వారు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటారన్నారు. తద్వారా జీవన విధానంలో ఎటువంటి సమస్యలైన పూర్తిగా ఎదుర్కొనే వారిగా విద్యార్థులు తయారవుతారన్నారు.

## మత్స్యకార సహకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

బొర్రంపాలెం మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి.ఈశ్వర్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా బత్తుల రమేష్, ఉపాధ్యక్షుడిగా కొత్తూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ముల్కి సురేష్ మరో ఆరుగురు డైరక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పెండ్యాల అభిషేక్ బాబు, మత్స్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గో ఆధారిత సాగు పరిశీలన

**ప్రజాశక్తి - చింతలపూడి**

రానున్న రోజుల్లో గ్రామంలో రైతులంతా కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఎర్రంపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు అవుతున్న దేశీ వరిపంటను ఆయన శనివారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ చిన్న సన్న కారు రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండిన పంటను తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎడిఎ నాగకుమార్, మండల వ్యవసాయాధికారి మీనా కుమారి, రైతులు, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామసభలను వినియోగించుకోండి

**ప్రజాశక్తి - ఆగిరిపల్లి**

రీ-సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని సగ్గూరులో శనివారం జరిగిన రీ సర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ గ్రామసభలో భూ సమస్యలకు సంబంధించి 25 అర్జీలను స్వీకరించినట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా తపనచౌదరి పుట్టినరోజు వేడుకలు

**పోలవరం :** పోలవరం మండలంలో గారపాటి సీతారామాంజనేయ చౌదరి పుట్టినరోజు వేడుకలు తపన ప్రతినిధి మల్లిపూడి రాజేష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పోలవరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బన్నులు అందించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవింద్, రషీద్, జగదీష్, గౌస్, తపన అభిమానులు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనకు విద్యార్థులు సహకరించాలి

**ఎసిబి డిఎస్‌పి వి.సుబ్బరాజు**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

మాట్లాడుతున్న ఎస్ఐబి డిఎస్‌పి సుబ్బరాజు

అవినీతి నిర్మూలనకు విద్యార్థులు సహకరించాలని ఎసిబి డిఎస్‌పి వి.సుబ్బరాజు కోరారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ - 2024 సందర్భంగా శనివారం స్థానిక సర్ సిఆర్.రెడ్డి అటానమస్ కళాశాల ఆడియోవిజువల్ హాలులో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు ఎసిబి డిఎస్‌పి వి.సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది వారం రోజులపాటు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అవినీతిని అంతమొందించడం, అవినీతి లేని సమాజాన్ని సృష్టించడం, దేశ ప్రగతిని సాధించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అవినీతిని నిర్మూలించడంలో విద్యార్థుల పాత్ర, భాగస్వామ్యం గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ మాట్లాడుతూ అవినీతి లేని సమాజాన్ని తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్స్ ఎమ్‌డి మహబూబ్‌బాషా, బి.శంకర్, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ ఎ.ధర్మేంద్ర, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు కానుకొల్లు విద్యార్థులు

**ప్రజాశక్తి - మండవల్లి**

ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఆటల పోటీలకు కానుకొల్లు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మాధవ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు పాఠశాలలో కైకలూరు నియోజకవర్గ ఎస్‌జిఎఫ్ టెన్నికాయిట్ పోటీలను శుక్రవారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఆటల్లో సీనియర్ బాలుర విభాగంలో జి.నాగసాయి, జి.మోహన్‌శశి, ఎన్.దేవిడ్‌శశిధర్‌లు, జూనియర్ విభాగంలో వంశీకృష్ణ, నవదీప్, అఖిల్‌రాజ్ కుమారులు, బాలికల సీనియర్ విభాగంలో రుక్మిణీదేవి, సౌమ్య, కీర్తి, దుర్గాభవాని జూనియర్స్ విభాగంలో కావ్య, తేజస్విని, వైష్ణవిలు ఆటలో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు జిల్లా స్థాయిలో నిర్వహించే టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా టెన్నికాయిట్ ఆటలు తర్ఫీదు ఇచ్చిన పీడీ సత్యనారాయణను, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు. జిల్లా స్థాయిలో కూడా మంచి నైపుణ్యం ప్రదర్శించి పాఠశాలకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్ కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలి

**బాణసంచా పేలిన ఘటనలో క్షతగాత్రులకు సిపిఎం పరామర్శ**

**ప్రజాశక్తి - ఏలూరు**

ఏలూరు పట్టణంలో బాణసంచా పేలి మృతి చెందిన దుర్గేసి సుధాకర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా ఎన్నడూ లేని విధంగా బాణసంచా పేలుడు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందటం చాలా బాధాకరమన్నారు. మృతుడు తూర్పు వీధి మారుతినగర్‌లో పేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని చెప్పారు. ఆ కుటుంబానికి మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించిన పరిహారం ఏమాత్రం సరిపోదని తెలిపారు. మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుని రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుడితో పాటు తీవ్ర గాయాలపాలై విజయవాడ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి విజయవాడలో ఏదైనా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించి కాపాడాలని కోరారు. ఏలూరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అవసరమైతే మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వివిఎన్.ప్రసాద్, బి.జగన్నాధరావు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటిలో రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు ట్రిపుల్ ఐటిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ వారి సహకారంతో ఎన్ఎస్ఎస్, హెల్పింగ్ హ్యాండ్స్‌ల సమన్వయంతో జరిగిన ఈ శిబిరంలో దాదాపు వంద విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ రక్తదాన కార్యక్రమాన్ని నూజివీడు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, విద్యార్థులకు రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్మోహన్ మాట్లాడుతూ రక్తం ఆవశ్యకతను వివరించారు. రోడ్డు ప్రమాద బారిన పడిన వారికి, గర్భిణులకు, ఆపరేషన్ చేయించుకునేవారికే కాకుండా తలసేమియా చిన్నారులు రక్తంలో జన్యు లోపంతో పుడుతున్నారని, వీరికి ప్రతినెలా మూడు వారాలకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి వస్తుందని చెప్పారు. వీరి జీవితకాలం 20 నుంచి 30 సంవత్సరాలు మాత్రమేనని, ఇటువంటి చిన్నారులకు ఉచితంగా రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ ఉచితంగా రక్తం అందిస్తుందన్నారు. హెల్పింగ్ హాండ్స్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్, హెల్పింగ్ హ్యాండ్స్ విభాగాలను డైరెక్టర్ అమరేంద్ర, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు అభినందించారు.

## నాగులచవితి వేడుకలకు సుబ్రహ్మణ్య స్వామి ఆలయం సిద్ధం

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

విద్యుత్ కాంతులతో ఆలయం

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-చేవూరు సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని నాగులచవితి వేడుకలకు ముస్తాబు చేశారు. ఈ నెల ఐదో తేదీన నాగులచవితి ఉత్సవాలు జరుగనున్నాయి. ఆలయానికి సంబంధించి గోపురంతో పాటు ఆలయం ఇరువైపులా విద్యుత్ అలంకరణ చేశారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ అలంకరణతో సింగరాయపాలెం-చేవూరు సెంటర్ ప్రత్యేక ఆకర్షణగా చోటు చేసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద విద్యుద్దీకరణలు ఏర్పాటు చేశారు. ఆలయ ఇఒ ఆర్.గంగాశ్రీదేవి ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నారు. మరింత ఎక్కువ మంది యాత్రికులు సింగరాయపాలేనికి తరలి రానున్నారు. యాత్రికుల రాక దృష్టిలో పెట్టుకొని అందుకు అనుగుణంగా అధికారులు ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

## రోడ్లు బాగుంటేనే అభివృద్ధి : మంత్రి పార్థసారథి

**ప్రజాశక్తి - దెందులూరు**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బి రహదారులను గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మండలంలోని గోపన్నపాలెం వద్ద జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డుకు సంబంధించి గుంతలు లేని రోడ్ నెట్‌వర్క్ కార్యక్రమానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి మంత్రి పార్థసారథి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.600 కోట్ల పైగా నిధులు కేటాయించి ఆర్అండ్‌బి రహదారులను గుంతలు లేని రహదారులుగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఏలూరు జిల్లాలో రూ.76 కోట్లతో రహదారి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.20 కోట్లతో సీసీ రోడ్లు చేపడుతున్నామని చెప్పారు. ఈ ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, రహదారులు, భవనాల శాఖ ఎస్ఇ జాన్‌మోషే, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ శ్రీదేవి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మాగంటి సురేంద్రనాథ్, స్థానిక నాయకులు మిల్లుబాబు, తదితరులు పాల్గొన్నారు.

**భీమడోలు :** గోతులు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ద్వారా అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో గోతులు రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని భీమడోలు కేంద్రంగా శనివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా 1.80 కిలోమీటర్ల పొడవున భీమడోలు జంక్షన్ నుంచి సంతపేట వరకు మరమ్మతులకు రూ.పది లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేసిన ఎంఎల్ఎ ధర్మరాజు, టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో కలిసి మరమ్మతు కార్యక్రమాల్లో పాల్గొని శ్రమదానం చేశారు. వీరితోపాటు పలువురు కూటమి నాయకులు, అభిమానులు తమ వంతు సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ భీమడోలు రోడ్లు భవనాల శాఖ కార్యాలయ ఆధ్వర్యంలో ఆరు వివిధ కార్యక్రమాలకు రూ.11.39 కోట్ల విలువైన మరమ్మతు పనులను చేపట్టారన్నారు. నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. టిడిపి నాయకులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గానికి రూ.21 కోట్లు కేటాయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి కెవెల్ తనూజ పాల్గొన్నారు.

**ఏలూరు సిటీ :** ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు అభివృద్ధి పనులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో వైసిపి పాలకుల నిర్లక్ష్యానికి గురైన రహదార్లకు కూటమి పాలనలో మోక్షం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏలూరు ఏడో డివిజన్‌లోని సత్యనారాయణ- విజయలక్ష్మి థియేటర్ మధ్యలో రోడ్డుపై ఉన్న గుంతలకు మరమ్మతు పనులను నగర మేయర్ నూర్జహాన్‌తో కలిసి ఎంఎల్ఎ బడేటి చంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఏలూరు నగర పరిధిలోని 50 డివిజన్లలో రోడ్ల మరమ్మతుల కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత బాగా పాడైపోయిన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేసేందుకు రూ.పది కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరంలోని 50 డివిజన్ల పరిధిలో దాదాపు 600కు పైగా గుంతల రోడ్లు ఉన్నట్లు గుర్తించి, వాటికి మరమ్మతులు చేసేందుకు రూ.25 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మారం అను, డివిజన్ ఇన్‌ఛార్జి రాజా మురళీకృష్ణ, కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్, సబ్బన శ్రీనివాస్, టిడిపి నగర కార్యదర్శి రెడ్డినాగరాజు, కార్పొరేషన్ ఎఇ రాజేంద్రకృష్ణ, ఇఇ సురేంద్ర, డిఇలు కొండలరావు, రజాక్, తాతబాబు, ఎఇలు సాయి, అరుణదేవి, సంధ్యారాణి పాల్గొన్నారు.

## రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ముదినేపల్లి :** మండలంలోని కొచ్చర్ల - పెదతుమ్మిడి ఆర్అండ్‌బి రోడ్డు అభివృద్ధి పనులకు కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ శనివారం శంకుస్థాపన చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్డు దెబ్బ తినడంతో ప్రజలు, రైతులు, వాహనదారులు ప్రయాణం సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎంఎల్ఎ దృష్టికి గ్రామస్తులు, ఆయా గ్రామాల ఆక్వా రైతులు తీసుకువెళ్లారు. ప్రభుత్వ నిధులు రూ.26 లక్షలు మంజూరు కావడంతో 11 కిలోమీటర్ల పొడవునా రోడ్డు మరమ్మతులు చేయనున్నారు.

### పేరు మార్పు ప్రకటన

గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి గుండుగొల్లు మహంకాళి, డోర్‌నెం.15-9, పెదపేట, చర్చి దగ్గర, ఉండి, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నా పేరును గుండుగొలును శేఖర్ (పాతపేరు) తండ్రి గుండుగొలును మహంకాళి నుండి గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి గుండుగొల్లు మహంకాళిగా మార్చుకున్నాను. ఈరోజు నుండి అదుపరి అన్ని లావాదేవీల కోసం నా కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

**గుండుగొల్లు చంద్రశేఖర్, S/o.మహంకాళి**
**డోర్‌నెం.15-9, ఉండి మండలం, ప.గో.జిల్లా.**

### టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.TNK Mplty/1684/19/2024/ఇ1

తేది.02-11-2024

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

| | | | ఇ.సి.వి. (రూ. లక్షలలో) |
|---|---|---|---|
| 1. | వాటర్ సప్లయి పనులు | 2 నెం.లు | 9.32 |
| 2. | రోడ్డు పనులు | 1 నెం.లు | 8.14 |

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 04-11-2024వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- **కమిషనరు**
తణుకు పురపాలక సంఘం

### దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపల్ ఆఫీసు ఏరియా, వెంకయ్యనాయుడు గారి వీధి, గంధం అపార్టుమెంట్స్ ప్లాట్ నెం.401రు కాపురస్తులు 1.కారిచర్ల శ్యామ్, s/o.కారిచర్ల ఆంజనేయులు 2. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ MIG-2-18 కాపురస్తులు దుమారపు వెంకన్నదొర, s/o.దుమారపు ఏడు కొండలు అను మా యొక్క 1128/1998 ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. భీమవరం మున్సిపల్ ఏరియాలోని భీమవరం పట్టణం తాలూకు రి.స.నెం.152/2, 152/3, 152/4, 169/1, 169/2, 169/3, 169/4 ర్లులో చ.గ.457 1/2లు స్థలం కలదు. దస్తావేజు నెం.1128/ 1998 గల ఒరిజినల్ దస్తావేజును ది.11-10-2024 తేదీన ఒక కవరులో పెట్టుకుని హౌసింగ్‌బోర్డు కాలనీ నుండి భీమవరం తాలూక ఆఫీసుకు వెళుచుండగా దారి మధ్యలో పడిపోయినది. సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

**పంపన రవికుమార్, గుత్తుల లక్ష్మి సునీత,** అడ్వకేట్స్
మోగంటి వారి వీధి, భీమవరం. సెల్: 9848444409

### ప్రకటన

**మహారాజశ్రీ పాలకొల్లు అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

**O.S.247/2021**

Between:
Plaintiff : Gubbala Thrimurthulu
And
Defendant : Bandi Satyanarayana
To.
Bandi Satyanarayana,
S/o.Subba Rao, R/o.Pedamamidipalli,
Palakol Mandal, W.G.Dt.

పై నంబరు దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున వాది పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు అమలు జరిపించమని కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా శ్రీకోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు మీకు పంపమని ఉత్తర్వులు జారి చేసినందున పై నంబరు దావాలో మీ హాజరు నిమిత్తం ది.**20-11-2024** సం.తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని.లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెనని, లేని యెడల మీ పరోక్షమందు దావా ముందు గ్రంథము జరుపబడును.

పాలకొల్లు **తోట వెంకటేశ్వరావు,** న్యాయవాది,
తేది.02-11-2024 పాలకొల్లు, ప.గో.జిల్లా.

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం**

**O.S. No. 100/2020**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) వేముల లక్ష్మణ మరియు యితరులు -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: వేముల లక్ష్మణ, S/o. మోహనరావు, డోర్ నెం. 4-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: వేముల సావిత్రి, W/o. లక్ష్మణ, డోర్ నెం. 4-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 07-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

**మోచర్ల సత్యకృష్ణ,** న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం**

**O.S. No. 299/2022**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) కొండేటి ఉమ మరియు యితరులు -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: కొండేటి ఉమ, W/o. సుబ్బారావు, డోర్ నెం. 4-19/1, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: పితాని సత్యనారాయణ, S/o. గాంధీ, డోర్ నెం. 21-8-11/A, యడ్లబజారు, పాలకొల్లు, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 04-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

**మోచర్ల సత్యకృష్ణ,** న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514